ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
కర్ణాటక వార్తలు
ఆదివారం 14 జూలై 2024



యడియూరప్పకు ఉపశమనం

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడియూరప్పకు కాస్త ఉపశమనం లభించింది. సోమవారం ఆయన ప్రత్యేక కోర్టు ముందు హాజరు కావాల్సి ఉండగా హైకోర్టు ధర్మాసనం మినహాయింపు ఇచ్చింది. ఈనెల 28వరకు యడియూరప్పకు కోర్టు ముందు హాజరయ్యే విషయంలో మినహాయింపు లభించింది. పోక్సో కేసులో దాఖలైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని యడియూరప్ప హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం ఈనెల 28వరకు మినహాయింపు ఇచ్చింది.

పెరిఫెరల్ రింగురోడ్డుకు అడుగులు

నిర్మాణానికి ముందుకు వచ్చిన 'నైస్'
ట్రాఫిక్ నియంత్రణకు తొలగనున్న అడ్డంకులు
ఉపముఖ్యమంత్రితో 'నైస్' ప్రతినిధుల చర్చలు

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మహానగరి బెంగళూరులో దశాబ్దాల కాలంగా తీరని సమస్యగా ఉన్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు రూపొందించిన పెరిఫెరల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టును నిర్మించేందుకు 'నైస్' కంపెనీ ముందుకు వచ్చింది. ఇటీవల పీఆర్ఆర్ టెండర్ మూడోసారి ఆహ్వానించారు. మూడు ప్యాకేజీలుగా నిర్మాణాలు చేపట్టదలిచారు. ఇందులో ఒక ప్యాకేజీ పనులను చేపట్టేందుకు నైస్ కంపెనీ ముందుకొచ్చింది. పెరిఫెరల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టు తుమకూరు రోడ్డు నైస్ జంక్షన్‌లో ప్రారంభమై దొడ్డ బళ్లాపుర రోడ్డు, బళ్లారి రోడ్డు, పాత మద్రాస్ రోడ్డు మీదుగా హోసూరు రోడ్డు జంక్షన్‌కు ముగియనుంది. ప్రాజెక్టుకు సంబంధించి రెండు చోట్ల నైస్ రోడ్డు అనుసంధానంగా ఉన్న మేరకు తుమకూరు లేదా హోసూరు రోడ్డులో ప్రారంభమయ్యే రెండు ప్యాకేజీలలో పాల్గొని సులభతరంగా పనులు చేపట్టవచ్చునని నైస్ సంస్థ భావిస్తోంది. ఇప్పటికే నైస్ కంపెనీ తుమకూరు రోడ్డును మాగడి రోడ్డు, మైసూరు రోడ్డు, కనకపుర రోడ్డు, బన్నేరుఘట్ట రోడ్డు మీదుగా హోసూరు రోడ్డువైపు నాలుగులేన్ల మార్గంలో నిర్మించి ప్రజల సంచారానికి అవకాశం కల్పించింది. ఈ మార్గంలో నగరం చుట్టూ అర్ధ వలయాకారంలో నిర్మించారు. మరో అర్ధభాగం పెరిఫెరల్ రింగ్‌రోడ్డుకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం నైస్ ఏ ఇతర ప్రాజెక్టులను చేపట్టడం లేదు. ఇదే కారణంతోనే ఒక ప్యాకేజీ పనులను పొంది నిర్మాణాలు చేపట్టదలిచినట్టు తెలుస్తోంది. ఇప్పటికే నైస్ సంస్థ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సూత్రప్రాయంగా చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం పీఆర్ఆర్ టెండర్లను బీడీఏ వెనుకడుగు వేసింది. ప్రాజెక్టును వదులుకునేది లేదని స్పష్టం చేసింది. కొత్త రూపంతో ప్రాజెక్టు చేపట్టేందుకు బ్లూ ప్రింట్‌ను తయారు చేసేలా డీసీఎం బీడీఏకు సూచించారు. పెద్ద ప్రాజెక్టు కావడంతో ఇప్పటి వరకు ఏ కంపెనీ అంత భారీ నిధులతో చేపట్టేందుకు సంసిద్ధత ప్రకటించలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మూడు ప్యాకేజీలుగా విభజించి ప్రాజెక్టును అమలు చేయదలిచారు. ఈ ప్రస్తావనలను కార్యరూపం దాల్చేందుకు డీసీఎం అధ్యక్షతన స్పెషల్ ప్లానింగ్ వింగ్ (ఎస్‌పీవీ)ని రూపొందించారు. ఇప్పటికే ఎస్‌పీవీ తన కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. కొత్తగా టెండర్లను ఆహ్వానించేందుకు మూడు లేదా నాలుగు ప్యాకేజీలలో రింగ్ రోడ్డు నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక వనరులు, టోల్ చార్జీ, రోడ్ల పర్యవేక్షణ వంటి అంశాలపై దృష్టి సారించింది. పెరిఫెరల్ రింగ్‌రోడ్డు 73.5 కిలోమీటర్ల మేర ఉంటుంది. వీటిని తుమకూరు రోడ్డు నుంచి బళ్లారి రోడ్డు దాకా ఒక ప్యాకేజీ, బళ్లారి రోడ్డు నుంచి పాత మద్రాస్ రోడ్డు దాకా మరో ప్యాకేజీ, పాత మద్రాస్ రోడ్డు నుంచి హోసూరు రోడ్డు వరకు ప్యాకేజీలను విభజించదలిచారు. తొలిరెండు ప్యాకేజీలను సుమారు 20 కిలోమీటర్ల పొడవుతో రూపొందించనున్నారు. మూడో ప్యాకేజీలో 30 కిలోమీటర్ల దాకా ఉంటుంది. ప్రాజెక్టులను కాలపరిమితిలోగా పూర్తి చేసేలా నిర్ణయించారు. త్వరలోనే డీసీఎం డీకే శివకుమార్ నేతృత్వంలో ఎస్‌పీవీ సభ జరిపి తుది రూపురేఖలు తీసుకురానున్నారు. పెరిఫెరల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించాల్సి ఉన్నందున టెండరును పొందే కంపెనీ పెట్టుబడులను వాపసు పొందేందుకు టోల్ వ్యవధిని ఎక్కువ కాలం ఇవ్వాలని ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. భూస్వాధీన ప్రక్రియను కంపెనీలే భరించాల్సి ఉంటుంది. టోల్ వసూళ్ల వ్యవధి అనివార్యంగా పెంచాల్సి ఉంటుంది. ప్రతి ప్యాకేజీలోనూ రింగ్‌రోడ్డు ఎంట్రీ, ఎగ్జిట్ జంక్షన్‌లలోనూ టోల్ వసూలు చేసేలా భావిస్తున్నారు. ఇప్పటికే నైస్ సంస్థ తన టోళ్లలో వచ్చే ప్రతిజంక్షన్‌లోనూ వసూలు చేస్తోంది. ఇదే విధానం కొత్త ప్యాకేజీలోనూ అమలు చేయదలిచారు. పెరిఫెరల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టు అమలుకు మూడోసారి ఆహ్వానించిన టెండర్లు కార్యరూపం దాల్చకపోవడంతో, 3 లేదా అంతకంటే ఎక్కువ ప్యాకేజీల రూపంలో టెండర్లను ఆహ్వానించే విషయమై చర్చలు జరిగినట్టు బీడీఏ కమిషనర్ జయరాం తెలిపారు.





ప్రతిపాదిత రింగ్‌రోడ్డు నమూనా (ఎరుపురంగు మార్గం)

అసెంబ్లీ సమావేశాలకు
సర్వం సిద్ధం

రేపటి నుంచి కార్యకలాపాలు
సభ్యులు, మంత్రుల హాజరుపై సాంకేతిక పరిశీలన
విధానసౌధ చుట్టూ ఆంక్షలు



పరిషత్‌లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సమరం తర్వాత శాసనసభ సమావేశాలకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. శాసనసభ సమావేశాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా మంత్రులు, ఎమ్మెల్యేల హాజరుతోపాటు ఎంత సమయంపాటు సభ్యులు సభలో గడిపారనే సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేశారు. ఇదే విషయాన్ని శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, విధాన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టిలు వెల్లడించారు. కొత్త సాంకేతిక విధానం ద్వారా సభ్యులు రోజుకు ఎన్నిసార్లు ప్రవేశిస్తారనేది నికరంగా గుర్తిస్తుంది. సభలో ఏ సభ్యుడు ఎంత సమయంపాటు గడిపారనేది పరికరం ద్వారా తెలుసుకునే వీలుంది. రోజంతా సభలో గడిపే సభ్యులకు ప్రత్యేక బహుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి సభకు తొలిసారిగా వస్తున్న వారికి బహుమతి ఇస్తున్నామని ప్రకటించారు. రోజంతా సభలో ఉంటూ కార్యకలాపాలలో భాగస్వాములు కావడం, అవగాహన పెంచుకునేవారిని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. శాసనసభ కలాపాలను వీక్షించేందుకు దేశ విదేశీ కమిటీ సభ్యులు వస్తుంటారని తెలిపారు. సభను కొంత ఆధునికీకరణ చేశామన్నారు. ఈనెల 15న కార్యకలాపాల ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభిస్తారని వివరించారు. ఈనెల 26వరకు 9రోజులపాటు కార్యకలాపాలు కొనసాగుతాయని అన్నారు. తొలిరోజు ఇటీవల మృతి చెందిన ప్రముఖులకు సంతాప తీర్మానం ప్రవేశపెడతామని అన్నారు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి స్వీకరించిన బిల్లులను అంగీకారం కోసం తీసుకుంటామన్నారు. బిల్లులను ముందుగానే సభకు ఇవ్వాలని, తద్వారా చర్చలు జరిపేందుకు సులభతరం కానుందని వివరించామన్నారు. 2023-24 కర్ణాటక శాసనసభ కమిటీల వ్యవధి ఆగస్టు 8తో ముగియనుందన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి కొత్త కమిటీల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సభాపతి హొరట్టి మాట్లాడుతూ ఏడాదికి 60రోజుల శాసనసభ కలాపాలు జరగాలనే నిబంధనలు ఉన్నా ఇటీవల అమలు కావడం లేదన్నారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చలు జరుపుతామని అన్నారు. ఎక్కువరోజులు శాసనసభ కార్యకలాపాలు జరగడం ద్వారా రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చకు అవకాశం ఉంటుందన్నారు. ఎక్కువరోజులు సభ జరగడం మంచి సంప్రదాయమన్నారు.

20న చెస్ పోటీలు

ప్రపంచ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో బ్యాంక్వెట్‌హాల్‌లో లెజిస్లేచర్ కప్ చెస్ పోటీలు ఏర్పాటు చేశామని శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, విధాన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి తెలిపారు. పాత్రికేయులు భాగస్వాములు కావచ్చు అన్నారు. ఈనెల 20న పోటీలు జరుగుతాయని ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శాసనసభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్న తరుణంలో ఆదివారం రాత్రి నుంచి విధానసౌధ పరిధిలో 144వ సెక్షన్‌ను విధించారు. విధానసౌధ చుట్టూ అంబేడ్కర్ రోడ్డుతోపాటు చాళుక్య సర్కిల్‌వైపు ప్రత్యేక ఆంక్షలు అమలులోకి రానున్నాయి.

రెండేళ్లలో రైల్వేలైన్ పూర్తి చేస్తాం

రాయదుర్గం-తుమకూరు రైల్వేలైన్ పనుల పరిశీలన
నిర్వాసితులకు న్యాయం చేస్తాం
నీటి సమస్యలపై డీపీఆర్ తయారు చేయండి
రైల్వే, జలవనరుల శాఖల సహాయ మంత్రి మంత్రి సోమణ్ణ



పావగడ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సోమణ్ణ

పావగడ, జూలై 13: రాయదుర్గం-తుమకూరు రైల్వేలైన్ నిర్మాణ పనులు 2026 డిసెంబరులోపు పూర్తి చేయడమే లక్ష్యమని రైల్వే, జలవనరుల శాఖల సహాయ మంత్రి సోమణ్ణ పేర్కొన్నారు. మడకశిర సమీపంలో జరుగుతున్న రైల్వేలైన్ నిర్మాణ పనులను శనివారం ఆయన ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి పరిశీలించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ రాయదుర్గం-తుమకూరు, మడకశిర మీదుగా జరుగుతున్న రైల్వే పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. రైల్వేలైన్ నిర్మాణ పనుల వల్ల ఇళ్లు కోల్పోతున్న బాధితులకు అండగా ఉంటామన్నారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారుల ను ఆదేశించారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, జలశక్తి మిషన్ నుంచి నిధులు మంజూరు చేయించి ప్రజల దాహార్తి తీర్చాలని కేంద్రమంత్రిని కోరారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో చెరువుల మరమ్మతులు, చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.500 కోట్ల నిధులు అవసరమవుతాయని, వాటిని మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి డీపీఆర్ తయారు చేసి పంపాలని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే రింగ్‌రోడ్డు, రైల్వేలైన్ నిర్మాణం ఆగిందని, వెంటనే పూర్తి చేసేందుకు కేంద్రమంత్రి సహకారం కోరినట్లు తెలిపారు.

ముందుచూపున్న నాయకుడు చంద్రబాబు : కేంద్ర మంత్రి సోమణ్ణ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి పట్ల ముందు చూపున్న గొప్ప వ్యక్తి అని కేంద్ర మంత్రి సోమణ్ణ అన్నారు. శనివారం మడకశిరలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఇంటి వద్ద నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇద్దరి నాయకత్వంలో దేశం, రాష్ట్రం ప్రగతి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువుల మరమ్మతుల కోసం ఒక ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని, అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వక్కలిగలు, లింగాయతులు, సాదర కులస్థులను ఓబీసీలోకి చేర్చేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.

రైల్వే పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి

ఆంధ్రప్రదేశ్‌లోని రాయదుర్గం నుంచి కర్ణాటకలోని తుమకూరు వరకు 207 కి.మీ. రైల్వే లైన్ నిర్మాణ పనులను కేంద్ర రైల్వే, కేంద్ర జనవనరుల సహాయ శాఖల మంత్రి సోమణ్ణ శనివారం పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 63కి.మీ. పనులు పూర్తయ్యి రైలురాకపోకలు జరుగుతుండగా కర్ణాటకలో ఇంకా భూసేకరణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ పనులను వేగవంతం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను హెచ్చరించారు.



మొక్కలు నాటుతున్న రైల్వే మంత్రి సోమణ్ణ, పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ తదితరులు

కార్యకర్తల కష్టాలు విన్న సీఎం

కేపీసీసీకి తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు
వినతుల స్వీకరణ



కేపీసీసీలో కార్యకర్తల సమస్యలు ఆలకిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జనస్పందన పేరిట ప్రజల సమస్యలు తెలుసుకుని ఎక్కడికక్కడ పరిష్కరించే విధానం ముఖ్యమంత్రులు అమలు చేస్తుంటారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కేవలం పార్టీ కార్యకర్తల సమస్యలు తెలుసుకునేందుకే వచ్చారు. రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాక కార్యకర్తల సమస్యలు వినేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చారు. నేరుగా కార్యకర్తల చెంతకే వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు దివ్యాంగులు మూడు చక్రాల సైకిళ్లు కావాలని, ప్రభుత్వ ఉద్యోగం, బోర్డులు కార్పొరేషన్‌లలో ఉద్యోగ అవకాశాలు, కాంట్రాక్టు ఉద్యోగాలు కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలతో సమస్యలు అడిగారు. వందలాది మంది తరలిరావడంతో వారందరి నుంచి వినతులు స్వీకరించారు. హుబ్బళ్లి - ధారవాడకు చెందిన ఇస్మాయిల్ మాట్లాడుతూ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకుంటున్నామని, పోలీసులు వేధిస్తున్నారని తెలిపారు. 30-40 ఏళ్లుగా పార్టీలో ఉన్నా, కనీసమైన గుర్తింపు లేదని పలువురు వాపోయారు. ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్, జీసీ చంద్రశేఖర్ సహా పలువురు ఉన్నారు.


బీజేపీ మాజీ ఎమ్మెల్సీ డీఎస్ వీరయ్య అరెస్టు



బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దేవరాజ్ అరసు ట్రక్ టెర్మినల్‌లో రూ. 47.10 కోట్ల అవినీతికి సంబంధించిన వివాదంలో బీజేపీ మాజీ ఎమ్మెల్సీ డీఎస్ వీరయ్యను సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. 2021-23 అవధిలో దేవరాజ్ అరసు ట్రక్ టెర్మినల్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. టెర్మినల్ పనులను షార్ట్ టెండర్‌కు కేటాయించడం ద్వారా రూ.47.10 కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణల మేరకు సీఐడీ దర్యాప్తు చేస్తోంది. అరెస్టు చేస్తారని వీరయ్య ముందస్తు బెయిల్ పొందారు. శుక్రవారం ప్రజా ప్రతినిధుల కోర్టు బెయిల్‌ను రద్దు చేయడంతో అప్రమత్తమైన సీఐడీ అధికారులు వెంటనే మైసూరుకు వెళ్తున్న వీరయ్యను అరెస్టు చేశారు. కోర్టు ముందు హాజరు పరిచి సమగ్ర విచారణకు కస్టడీకి తీసుకున్నారు. 821 టెర్మినల్ పనులు కాంట్రాక్టు ఇవ్వగా 153 పనులు మాత్రమే నిర్వహించారని, మిగిలిన 668 పనులు చేపట్టకనే నకిలీ బిల్లులు తయారు చేసి మూడు కాంట్రాక్టు ఏజెన్సీలకు విడుదల చేశారని అభియోగాలు ఉన్నాయి. ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్, వెనీశా ఎంటర్‌ప్రైజెస్, మయూర్ అడ్వర్టయిజ్‌మెంట్ పేరిట రూ.32.42 కోట్లు విడుల చేశారు. ఇందుకు కాంట్రాక్టర్లు వీరయ్య ఖాతాకు బదిలీ చేశారు. రూ.10 కోట్ల విలువైన టెర్మినల్ పనులు షార్ట్ టెండరుకు అవకాశం లేకున్నా డైరెక్టర్ల సభలో సడలించుకుని నిర్వహించినట్టు తేలింది. టెర్మినల్ మాజీ ఎండీ శంకరప్పను ఇప్పటికే అరెస్టు చేయగా ప్రస్తుతం పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

ఆగస్టులో బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్

పోస్టర్లు విడుదల చేసిన సాహితీ ప్రముఖులు
300 మందికిపైగా సాహితీవేత్తల భాగస్వామ్యం



ఉత్సవ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సాహితీవేత్తలు

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద భారతీయ భాషా సాహిత్య ఉత్సవాన్ని 'బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ 2024' పేరిట ఆగస్టులో నిర్వహించనున్నారు. ఉత్సవ్‌లో తెలుగు, కన్నడ, మళయాళం, ఇంగ్లీషు భాషలకు సంబంధించి 300 మందికిపైగా సాహితీవేత్తలు భాగస్వాములు అవుతారు. 80కు పైగా చర్చాగోష్టులు జరగనున్నాయని సీనియర్ సాహితీ పరిశోధకుడు నాడోజా హంపా నాగరాజయ్య వెల్లడించారు. బెంగళూరు ప్రెస్ క్లబ్‌లో శనివారం బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌కు సంబంధించి ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. సాహితీవేత్తలు, పరిశోధకులు డాక్టర్ మల్లేపురం జి. వెంకటేశ్, డాక్టర్ నడహళ్లి బాలసుబ్రహ్మణ్యం, సాహిత్య ఉత్సవ్ డైరెక్టర్, రచయిత సతీశ్ చప్పరికె పోస్టర్‌ను విడుదల చేశారు. నగరంలోని కోరమంగల ప్రాంతం సెయింట్ జాన్ ఆడిటోరియంలో ఆగస్టు 9 నుంచి మూడు రోజుల పాటు సాహిత్య ఉత్సవ్ జరగనుంది. డాక్టర్ నడహళ్లి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సాంస్కృతిక స్థితి గతుల పరిశీలిస్తే బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ అవసరమని తెలిపారు. ప్రపంచ సాహిత్యానికి కన్నడ, తెలుగు, తమిళ, మళయాళం భాషల సేవలు అపారమైనవని అన్నారు. చారిత్రాత్మకంగా మహత్తరమైన నాలుగు భాషలను ఒకే వేదికకు తీసుకొచ్చి పరస్పరం చర్చాగోష్టులు జరపడం ఈ ఉత్సవం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. నాలుగు భాషలతో కలిపి భారీ స్థాయిలో ఇంటువంటి ఉత్సవ్ దేశంలో ఎప్పుడూ జరగలేదన్నారు. సాహితీవేత్తలతోపాటు దక్షిణభారత్‌లోని ప్రముఖ పబ్లిషర్స్ కూడా పాల్గొంటారని అన్నారు. అమెరికాలోని చికాగో విశ్వవిద్యాలయ ప్రతినిధులు దక్షిణభారత పబ్లిషర్స్‌తో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

భారతీయ భాషల్లో మహత్తరమైన సాహితీకృతులను గుర్తించి వాటిని ఆంగ్లభాషకు తీసుకెళ్లే ప్రయత్నానికి చికాగో విశ్వవిద్యాలయం సిద్ధమైందని అన్నారు. అందుకోసమే ఎస్ఏఎల్‌టీ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. సాహిత్య ఉత్సవ్‌కు సంబంధించి డాక్టర్ మల్లేపురం జి. వెంకటేశ్ మాట్లాడుతూ ఇది కేవలం సాహిత్య ఉత్సవం మాత్రమే కాదని దక్షిణభారత కళలు, సంస్కృతి సాహిత్య మహాసంగమం అన్నారు. మూడు రోజుల ఉత్సవంలో 9 సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. పద్మశ్రీ గ్రహీత వెంకటేశ్ కుమార్, ఆర్‌కే పద్మనాభ, ప్రకాశ్‌రాజ్, బిందుమాలిని, మానసి సుధీర్, మేఘనా చంద్రమౌళి కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. మైసూరు నటన, శ్రీరంగపట్టణ రంగ ప్రదర్శన, కెరమనె మేళా బృందం యక్షగాన ప్రదర్శనలు ఉంటాయన్నారు. సెయింట్‌జాన్స్ ఆడిటోరియం ప్రాంగణంలో ఐదు భాషల్లో 60కుపైగా బుక్‌స్టాల్స్ ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఉత్సవానికి తల్లిదండ్రులతోపాటు పిల్లలు వచ్చేలా ప్రత్యేక స్టాల్స్ ఉంటాయన్నారు. 20కు పైగా చిత్రకారులు, కృతుల ప్రదర్శన, విక్రయాలు ఉంటాయన్నారు. దక్షిణభారత ప్రజల మనసులు గెలిచేలాంటి సాహిత్య ఉత్సవం జరుగుతుందన్నారు. ఉత్సవంలో పాల్గొనే సాహితీవేత్తలు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలని, ప్రవేశం ఉచితమన్నారు. బుక్ బ్రహ్మ లిట్‌ఫెస్ట్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ప్రతినిధులకు ప్రత్యేక పాస్‌లు ఉంటాయన్నారు.

మంగళముఖిల పట్ల సానుకూలంగా ఉండాలి

▸ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు



సంస్థ ప్రారంభంలో మంత్రి దినేశ్‌గుండూరావు తదితరులు

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మంగళముఖిలు, స్వలింగ కాముకులు ఎల్‌జిబిటిక్యూ (లెస్బియన్, గే, బై సెక్సువల్, ట్రాన్స్‌జెండర్ అండ్ క్వశ్చనింగ్) వర్గానికి చెందిన వారిపట్ల సమాజంలో అందరూ సానుకూల ధోరణితో జనజీవన స్రవంతిలోకి తీసుకు రావాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు అభిప్రాయపడ్డారు. ఎల్‌జిబిటిక్యూ వర్గీయులు ఇరైవి చారిటబుల్ ట్రస్టు ప్రారంభోత్సవం శనివారం జరిగింది. ముఖ్యులుగా పాల్గొన్న మంత్రి దినేశ్‌గుండూరావు మాట్లాడుతూ మంగళముఖిలు ప్రకృతి సృష్టి కాగా స్వలింగ కాముకులు వారి ఇష్టంతో ఎల్‌జిబిటిక్యూ వర్గానికి చేరారన్నారు. వీరి రక్షణకు పలు చట్టాలు ఉన్నాయని, సుప్రీంకోర్టు కూడా వీరికి అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. అయితే సమాజం ఎంతో అభివృద్ధి చెందినా ఈ వర్గానికి చెందినవారిని ప్రజలు తిరస్కార భావంతోనే చూస్తారన్నారు. వారిని సమానులుగా చూసే ఆలోచనలు పెంచుకోవాలన్నారు. ఈ వర్గాల వారిని కుటుంబీకులు అంగీకరించరని ఇంట్లో ఉండేందుకు అవకాశం ఇవ్వరని దీంతో మానసికంగా, శారీరకంగా దౌర్జన్యాలకు గురవుతున్నారన్నారు. స్వలింగ కాముకులు అని ధైర్యంగా చెప్పుకునే పరిస్థితి లేదన్నారు. వారిని తిరస్కరించే భావనతో చూడ రాదన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో నమ్మ బెంగళూరు సహకారంతో నవంబరులో ఈక్వాలిటీ ప్రైడ్ మారథాన్‌ను జరగనుందన్నారు. కార్యక్రమంలో ఇరైవి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు విజయామేరీ, సీఈఓ జహ్రా ఫాతిమా, మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మసూద్ ఫౌజ్ దార్, స్పర్శ్ ఆసుపత్రుల ముఖ్యులు డాక్టర్ జాన్‌పాల్, డాక్టర్ సోమశేఖర మహావీర, డాక్టర్ రఘురామ, శృతి హెచ్‌ఆర్, ఆర్ యుక్తి, ఇరైవి సంస్థ సైదా కౌసర్ సల్మా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిశోధనాత్మక నైపుణ్యత పెంచాలి

▸ గీతం స్నాతకోత్సవంలో సుధాంశుమణి



వందే భారత్ ఎక్స్‌ప్రెస్ విజనరీ ఇంజనీర్ సుధాంశుమణికి సన్మానం

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అకడమిక్ అంశాలకంటే పరిశోధనాత్మకత నైపుణ్యత పెంచాలని వందే భారత్ ఎక్స్‌ప్రెస్ విజనరీ ఇంజనీర్ సుధాంశుమణి అభిప్రాయపడ్డారు. గీతం యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవం శనివారం క్యాంపస్‌లో జరిగింది. 1218మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. గీతం యూనివర్సిటీ ప్రెసిడెంట్ ఎం శ్రీభరత్ వర్చువల్ రూపంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవటం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాంశుమణి మాట్లాడుతూ సంప్రదాయ విద్యను అధిగమించి నైపుణ్యతను సాధించుకోవాల్సిన పోటీ తత్వం సమాజంలో నెలకొందన్నారు. ప్రపంచమంతటా నైపుణ్యతకు ప్రాధాన్యత ఉందని అందుకు తగ్గట్టుగా పోటీ పడాలన్నారు. విద్యాసంస్థలు విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచే దిశగా పాటుపడాలన్నారు. విద్యార్థి విజయవంతం కావాలంటే కేవలం జ్ఞానంతో సాధ్యం కాదని ఆధునిక సాంకేతికత, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మారాలన్నారు. గీతం అధ్యక్షులు శ్రీభరత్ వర్చువల్ రూపంలో మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమంగా చదివేందుకు తగిన వాతావరణం కల్పించడం మా ఉద్దేశ్యమన్నారు. పరిశోధనల ద్వారా ప్రపంచంలో మార్పులకు యువ విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వీసీ దయానంద సిద్దవటం మాట్లాడుతూ గీతం యూనివర్సిటీ అసాధారణ జ్ఞాన సముపార్జన కేంద్రమన్నారు. ప్రముఖ నృత్యకారిణి లీలా శామ్సన్, భారత్ లేక్‌మ్యాన్‌గా గుర్తింపు పొందిన ఆనంద్ మల్లిగవాడ్‌లకు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కేఎన్ఎస్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరును విస్తరించొద్దు

▸ ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రు లేఖ

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరును విస్తరించరాదని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రు ప్రత్యేకంగా సీఎం సిద్దరామయ్యకు శనివారం లేఖ రాశారు. బెంగళూరును కేంద్రీకరించుకుని అభివృద్ధి జరగాలనుకోవడం సరికాదని రాష్ట్ర ప్రజల పన్నులను పూర్తిగా బెంగళూరు అభివృద్ధి పనులకే కేటాయించరాదన్నారు. కల్యాణ కర్ణాటక, కిత్తూరు కర్ణాటక, మధ్య కర్ణాటక ప్రజలు ఏం కావాలని ప్రశ్నించారు. ఇప్పటికే ఉద్యోగాల కోసం సుదూరం ఉండే బెంగళూరుకు బదులు హైదరాబాద్, పూనె, ముంబై, పనాజీల వైపు వెళ్తున్నారని లేఖలో ప్రస్తావించారు. ఇటువంటి సమయంలో బెంగళూరును కేంద్రీకరించుకుని అభివృద్ధి చేస్తే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తుతాయన్నారు. కొత్త విమానాశ్రయం నిర్మించదలచుకుంటే మధ్య కర్ణాటక వైపు వెళ్లాలన్నారు. డీకే శివకుమార్ రాష్ట్రానికి డీసీఎం అని కేవలం రామనగర, చన్నపట్టణ, కనకపురలకు కాదనేది గుర్తుంచుకోవాలన్నారు. రామనగర జిల్లాను బెంగళూరు దక్షిణగా మార్చాలనుకోవడం సరికాదన్నారు. అభివృద్ధి అంటే ఒక ప్రాంతానికి కాదని, రాష్ట్రమంతటికీ అని మరువరాదన్నారు.

మైసూరు వారియర్స్ కోసం టాలెంట్ హంట్



టాలెంట్‌హంట్‌లో నిర్వాహక బృందం

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ గ్రూప్ రాబోయే టోర్నమెంట్లకోసం క్రికెట్ టాలెంట్‌హంట్‌ను నిర్వహించింది. ఎంపిక చేసిన క్రీడాకారులను మహారాజా ట్రోఫీ, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌లు మైసూరు వారియర్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. బెంగళూరులోని జస్ట్ క్రికెట్ అకాడమీలో హంట్ జరిగింది. 124మంది మీడియం పేస్ బౌలర్‌లు, 54మంది స్పిన్నర్‌లు, 47మంది బ్యాట్స్‌మన్‌లు, 20మంది కీపర్‌లతో కలిపి 260 మంది యువ క్రికెటర్‌లు పాల్గొన్నారు. తదుపరి టాలెంట్‌హంట్ ఈనెల 18న మైసూరులో జరగనుంది. క్రికెటర్‌లు కరుణ్‌నాయర్, వారియర్స్ మేనేజర్ సురేశ్ ఎన్ఆర్, అసిస్టెంట్ కోచ్ విజయ్ మాద్యాల్కర్ నేతృత్వం వహించనున్నారు. క్రీడాకారుల వేలం తర్వాత ఎంపికైనవారికి వారం రోజులపాటు మైసూరులోనూ, ఆ తర్వాత ఆగస్టు 15నుంచి చిన్నస్వామి స్టేడియంలో 15రోజులపాటు శిక్షణలు ఉంటాయన్నారు. టాలెంట్‌హంట్‌లో మైసూరు వారియర్స్ యజమాని, సైకిల్‌ప్యూర్ అగర్బత్తీ ఎండీ అర్జున్‌రంగ మాట్లాడుతూ యువ వర్ధమాన ప్రతిభావంతులను వెలికితీసేందుకు మావంతు కృషి చేస్తామన్నారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి



ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం

శిడ్లఘట్ట, జూలై 13: మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని తద్వారా ఉన్నత హోదాలు పొందాలని ఎమ్మెల్సీ డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు. పట్టణ శివారులోని హండిగనాళలోని బాలాజి కల్యాణమండపంలో ఏఆర్ఎం పీయూ కళాశాల ఆధ్వర్యంలో 2024 సంవత్సర శ్రేయస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆ దిశగా ముందడుగు వేయాల్సిన అవసరం ఉందన్నారు. మీ ఉజ్వల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలపట్ల స్నేహభావంతో మెలగి వారిని చదువులో ప్రోత్సహించాలన్నారు. నటుడు చేతన్ మాట్లాడుతూ విద్యతోనే ప్రగతి సాధ్యమన్నారు. అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను సన్మానించారు. కన్నడ రాజ్యోత్సవ పురస్కార గ్రహీత దేవరమళ్ళూరు మహేశ్ నేతృత్వంలో జానపద గేయాలాపన సభికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త గుర్రప్ప, శారదా విద్యాసంస్థ అధ్యక్షుడు మునిరత్నం, న్యాయవాది హరిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వందమందికి ప్రోత్సాహకాల పంపిణీ



ప్రోత్సాహక మొత్తాలతో విద్యార్థులు

దొమ్మసంద్ర, జూలై 13: దొమ్మసంద్ర గ్రామంలోని ధర్మసాగర డిఎంఎం హైస్కూల్‌కు చెందిన 8, 9, 10 తరగతులకు చెందిన 2023-24కు చెందిన వందమంది విద్యార్థులకు 1.50లక్షల రూపాయలు ప్రోత్సాహకంగా అందచేశారు. శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. మధుకాంత విద్యాలయ విద్యార్థి సంఘాన్ని అధ్యక్షులు గోపాలరెడ్డి, ఉపాధ్యక్షులు అంబుజాక్షిరెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ఎం రవీంద్రరెడ్డి, ఎస్‌వీపీ హైస్కూల్ సర్జాపుర రామకృష్ణయ్య, ఎల్ నాగేశ్, డీవీ చెలువరాజు, డీసీ మనోహర్, కృష్ణరాజు, వేణు, ప్రభాకర్‌రెడ్డి, అణ్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

గ్రంధి మల్లికార్జున రావు (పుట్టినరోజు)



జీఎంఆర్‌గా చిరపరిచితులైన ప్రముఖ వ్యాపారవేత్త గ్రంధి మల్లికార్జున రావు 1950 జూలై 14న శ్రీకాకుళం జిల్లా రాజాం ప్రాంతంలో జన్మించారు. రోడ్లు, విద్యుత్, విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించి వ్యాపారాలలో ఆయన తనదైన ముద్రను చాటుకున్నారు. 7 దేశాలలో ఆయన వ్యాపారాలు విస్తరించాయి. 2007లో ప్రపంచంలో ధనికుల జాబితాలో 349వ స్థానంలో నిలిచారు. ఆయన ఆస్తి 2.6 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. 2024లో ఫోర్బ్స్ ప్రకటించిన భారతదేశంలో ధనికుల జాబితాలో 13వ స్థానంలో నిలిచారు. ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవలందిస్తున్నారు.

తనికెళ్ల భరణి (పుట్టినరోజు)



రంగస్థల, సినిమా రచయితతో పాటు నటుడిగా రాణించిన తనికెళ్ల భరణి 1956 జూలై 14న పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం జగన్నాథపురంలో జన్మించారు. కామెడీ, విలన్, ఉదాత్తమైన వైవిధ్యమైన పాత్రలతో ప్రజాదరణ పొందారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలపై పలు నాటకాలు రాశారు. సముద్రం సినిమా కోసం ఉత్తమ ప్రతినాయకుడిగా నంది పురస్కారం, మిథునం సినిమాకు ఉత్తమ మాటల రచయితగా 2012 నంది పురస్కారం అందుకున్నారు. అంతేకాక శివభక్తుడిగా పలు ప్రసంగాలు చేస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

చాగంటి కోటేశ్వరరావు (పుట్టినరోజు)



ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు 1959 జులై 14న తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జన్మించారు. మానవ ధర్మంపై ఆసక్తితో అష్టాదశ పురాణాలను అధ్యయనం చేసి తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ప్రవచనాలను అందిస్తూ భక్తజన మనసులను రంజింపచేస్తున్నారు. సంపూర్ణ రామాయణం, శివ పురాణము, విరాటపర్వం, భాగవతం, సౌందర్యలహరి, రుక్మిణీ కల్యాణం, కనకధారా స్తోత్రం, గోమాత విశిష్టత, భజగోవిందం వంటి వాటిపై అనర్గళంగా ప్రసంగం చేయగలరు. విద్యార్థులలో సైతం సామాజిక స్పృహ పట్ల చైతన్యం కల్పిస్తుండడం విశేషం. ప్రవచన చక్ర వర్తి, ఉపన్యాస చక్రవర్తి, శారదా జ్ఞానపుత్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్న పురస్కారం, ఇంకా గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ప్రవచనాలకు ఎలాంటి పారితోషికం తీసుకోరు.

సాయి బోధనలే శిరోధార్యం

యువ సదస్సులో వక్తలు

అలరించిన సంగీత కచేరి

నేడు సత్యసాయి క్రికెట్ లీగ్‌పోటీలు



సంగీతకచేరి నిర్వహిస్తున్న బౌడెల్ బృందం

పుట్టపర్తి, జూలై 13 : సత్యసాయిబాబా ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలే తమకు శిరోధార్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. రెండోరోజు శనివారం ప్రశాంతినిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో సత్యసాయి గ్లోబల్ యంగ్ అడల్ట్ సదస్సు కొనసాగింది. దేశవిదేశాలకు చెందిన వక్తలు ప్రసంగించారు. ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలు, మానవాళికి అందిస్తున్న వెలకట్టలేని సేవలతో బాబా ఆధ్యాత్మిక గురువుగా పూజలు అందుకుంటున్నారన్నారు. ప్రశాంతినిలయం వేదికగా ప్రపంచానికి శాంతిసందేశాన్ని అందించారని వివరించారు. సత్యసాయి బోధనలను విశ్వవ్యాప్తం చేసేందుకు ముందుకెళుతున్నామని అన్నారు. మానవసేవయే మాధవసేవ అన్న సత్యంతో సామాజిక సేవలు అందిస్తున్నామని వివరించారు. ఉన్నత విద్య, విలువలు, కలిగి ఉండి సామాజిక సేవాస్పృహతో జీవనం సాగించాలని సూచించారు. సాయంత్రం సాయి కుల్వంత్ సభామండపంలో బౌడెల్‌బృందం సంగీతగాన కచేరి నిర్వహించారు. గంటపాటు మధురగానంతో భక్తులను అలరించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఆదివారం యువసదస్సు కొనసాగనుంది.

నేడు సత్యసాయి యూనిట్ కప్

సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం హిల్‌వ్యూ స్టేడియంలో భారత్‌లెవన్, గ్లోబల్‌లెవన్ జట్లమధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. మాజీ క్రికెటర్ మురళీకార్తీక్, ట్రస్టుసభ్యులు కలసి క్రికెట్‌లీగ్ పోటీలను ప్రారంభిస్తారు.

పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, జూలై 13: పాలిటెక్నిక్ కోర్సుల ద్వితీయ సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించనున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్ ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని 18న స్పాట్ అడ్మిషన్స్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తోపాటు హాజరు కావాలని కోరారు.

జనసంద్రంగా గూగూడు

దర్శనం కోసం రెండు కిలో మీటర్లు క్యూకట్టిన భక్తాదులు

ఇబ్బందులు పడిన మహిళలు, చిన్నారులు



ప్రత్యేక అలంకరణలో గూగూడు కుళ్లాయిస్వామి పీర్లు



అగ్నిగుండం ముందు భక్తజనం

నార్పల, జూలై 13: మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన గూగూడు కుళ్లాయిస్వామి నిత్య పూజ నివేదిన శనివారం జనసంద్రంగా మారింది. రెండవ శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు గూగూడుకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి దాదాపు రెండు కిలో మీటర్ల మేర క్యూలైన్‌లో భక్తులు నిలబడి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, కుళ్లాయిస్వామికి చక్కెర చదవింపులు చేశారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు వారిని అదుపుచేయలేక నానా అవస్థలు పడ్డారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ భక్తులకు ట్యాంకర్ల ద్వారా ఉచితంగా తాగునీరు అందజేశారు.

నేడు చిన్న సరిగెత్తు

గూగూడు కుళ్లాయిస్వామి చిన్న సరిగెత్తు ఆదివారం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. 15న నిత్య నివేదిన పూజ, 16న పెద్దసరిగెత్తు, 17న అగ్నిగుండం ప్రవేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శోభ, గ్రామ పెద్దలు జాఫర్‌వలి, రాజన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ హాల్ టిక్కెట్ల జారీలో జాప్యం

30వ తేదీకి మారిన పరీక్షలు కాపీయింగ్‌కు రూ. 4 వేల చొప్పున వసూళ్లు

గుంతకల్లు, జూలై 13: పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) వి ద్యార్థులకు హాల్ టిక్కెట్ల జారీలో సాంకేతిక లోపం ఏర్పడిన కారణంగా పరీక్షలు పదిహేను రోజులు వాయిదాపడ్డాయి. ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించాల్సిన పరీక్షలు ఆగస్టు 1వ తేదీకి మారాయి. సాంకేతిక సమస్య కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 4 వేల మందికి హాల్ టిక్కెట్లు జనరేట్ కాలేదని సమాచారం. ఈ కారణంగా పరీక్షలను 15 రోజులు ఆలస్యంగా నిర్వహించడానికి నిర్ణయించారు. కాగా ఐటీఐ పరీక్షలకు ఇంకా ఎగ్జామినేషన్ సెంటర్ల ను ఖరారుచేయలేదు. ఈనెల 24వ తేదీలోపు విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్లను చేర్చి ఆగస్టు 1వ తేదీ నుంచి పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలు రాయదలచిన విద్యార్థులకు ఈనెల 10వ తేదీ వరకూ ఫీజు కట్టే అవకాశం ఉండగా, సప్లిమెంటరీ వి ద్యార్థుల సౌలభ్యం కోసం 15వ తేదీ వరకూ గడువును పొడిగించారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిపించడానికి ఐటీఐల నిర్వాహకులు విద్యార్థుల నుంచి రూ. 4 వేలు వసూలు చేస్తున్నారు. గుంతకల్లు, గుత్తి, పామిడి ఐటీఐలలో దాదాపు 900 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గుత్తిలో ఒకటి, కొనకొండ్లలో ఒకటి, గుం తకల్లులో ప్రభుత్వ ఐటీఐతో కలిపి ఐదు ఐటీఐలు ఉన్నాయి. గు త్తిలో ఒకే కళాశాల ఉండటంతో అందులోని విద్యార్థులకు అనంతపురం సెంటరు లభిస్తోంది. గుంతకల్లులో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు అదే విద్యా సంస్థలో పరీక్షలు రాస్తారు. కానీ మిగతా నాలు గు ఐటీఐలు ఎగ్జామ్ సెంటరుగా కొనకొండ్ల ఐటీఐ వచ్చేలా పైరవీలు చేస్తున్నారు. గతంలో ప్రైవేటు ఐటీఐల విద్యార్థులకు ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో నిర్వహించేవారు. అక్కడ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వకపోవడంతో గత పదేళ్లుగా కొనకొండ్ల ఐటీఐలో పరీక్షలు నిర్వహించేలా మేనేజ్ చేస్తున్నారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిపించడం కోసం, కావాల్సిన ఎగ్జామ్ సెంటరు వచ్చేలా చేయడం కోసం అధికారులకు డబ్బు ఎరచూపడానికి విద్యార్థులు ఒక్కొక్కరి నుంచి రూ. 4 వేల చొప్పున వసూలు చేస్తున్నారు.

అంబాని వివాహంలో రామేశ్వరం కెఫె రుచులు

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రిలయెన్స్ దిగ్గజం అంబాని వారసుడు అనంత్ అంబాని, రాధికా మర్చంట్‌ల వివాహంపై దేశమంతటా ఒకటే చర్చ జరుగుతోంది. వివాహ వేడుకలు, హాజరైన దేశ విదేశీ ప్రముఖులు, మనోరంజన కార్యక్రమాలు సర్వత్రా హాట్ టాపిక్‌గా మారాయి. అతిథులకోసం దేశ విదేశీ ప్రత్యేక రుచులు సిద్ధం చేశారు. బెంగళూరు రామేశ్వరం కెఫె సంస్థ కూడా వివాహంలో పలు రుచులు అందించింది. రాత్రి భోజనంలో కొబ్బరి పురన్ పోలీ, పెసరట్టు, తట్ట ఇడ్లీ, బోండా సూప్, టీలను అందించినట్టు కెఫె ఫౌండర్ రాఘవేంద్రరావు ప్రకటించారు.

ఇప్పీ నూడుల్స్ ప్రచారం చేసిన క్రికెటర్లు



ఇప్పీ నూడుల్స్ బౌల్స్‌తో క్రికెటర్లు

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఐటీసీ కంపెనీ ఇన్‌స్టంట్ ఇప్పీ నూడుల్స్‌ను ప్రముఖ క్రికెటర్‌లు రాహుల్‌ద్రావిడ్, బుమ్రా, సూర్యకుమార్ యాదవ్‌లు రుచి చూశారు. దిటాస్క్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఇప్పీ బౌల్స్‌తో ఫోటో షేర్ చేశారు. సూర్యకుమార్ యాదవ్ ఇప్పీ నూడుల్స్ అభియానలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. రాహుల్‌ద్రావిడ్, బుమ్రాలతో కలసి ఉండడాన్ని అద్భుతంగాను ఆనందంగాను భావిస్తున్నా అన్నారు.

జలాశయాల వద్ద సందర్శకులపై ఆంక్షలు

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తీర ప్రాంత, పశ్చిమ కనుమలలో భారీ వర్షాలు కురుస్తున్నందున జలపాతాల చెంతకు సందర్శకులను నిషేధించారు. వారం రోజులక్రితమే ఇటువంటి ఉత్తర్వులు జారీ చేశారు. అయినా చిక్కమగళూరు జిల్లా పరిధిలోని చార్మాడి ఘాట్ చెంతకు సందర్శకులు వస్తుండడంతో పోలీసులు కఠినంగానే వ్యవహరిస్తున్నారు. జలపాతాల వద్ద ఉండేవారి బట్టలను స్వాధీనం చేసుకుని హెచ్చరించారు. వర్షాలధాటికి జలాశయాలలో భారీగా నీరు వస్తోంది. మరోవైపు కొండ గుట్టలు, అటవీ ప్రాంతాల లోపలికి సందర్శకులు వెళ్తున్నారు. తద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించినా అక్కడ స్నానాలు చేసేందుకు వెళ్తున్నవారి బట్టలు స్వాధీనం చేసుకుంటున్నారు. పోలీసుల చర్యలకు నెటిజన్‌లు అభినందిస్తున్నారు.

హెడ్‌మాస్టర్ వేధింపులు భరించలేకున్నాం

▸ కంటతడిపెట్టిన టీచర్లు


బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా ముళబాగిలు పట్టణం డీవీజీ ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్ తీరుపై ఉపాధ్యాయినులు కంటతడి పెట్టారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ హెడ్‌మాస్టర్ సొణ్ణప్ప వేధింపులు భరించలేక పోతున్నామని వాపోయారు. మరుగుదొడ్లకు వెళ్లే పరిస్థితి లేకుండా చేశారని, బాలికల మరుగుదొడ్లను ఎప్పుడు పడితే అప్పుడు పరిశీలన అంటూ లోపలికి వెళ్తారని వాపోయారు. పేరొందిన కవి డీవీ గుండప్ప జన్మించిన ఇంటినే పాఠశాల జరిపేలా దానం చేశారని, అటువంటి గొప్ప వ్యక్తి పేరుతో ఉండే పాఠశాలలో హెడ్‌మాస్టర్ రోజూ వేధిస్తున్నారని వాపోయారు. డీడీపీఐ, బీఈఓల మాటలు పట్టించుకోవడం లేదని, నోటికొచ్చినట్టు దూషిస్తారని, బ్లాక్‌మెయిల్ చేస్తారని విచారం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే సమృద్ధి శ్రీనివాస్‌కు ఉపాధ్యాయినులు ఫిర్యాదు చేశారు.

తగ్గిన చీనీ ధరలు

అనంతపురంరూరల్, జూలై 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌లో చీనీధరలు తగ్గాయి. గత కొన్నిరోజులుగా స్థిరంగా పలుకుతున్న ధరలు శనివారం తగ్గాయి. శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 753టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రేపు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

గుంతకల్లుటౌన్, జూలై 13: పట్టణంలోని రైల్వే క్రీడా మైదానంలో సోమవారం జిల్లా కబడ్డీ మహిళలు, పురుషుల జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులో ఆగస్టు 2,3,4 తేదీలో పాముజూల శ్రీనివాసులు, మహాలక్ష్మి మెమోరియల్ 11వ ఆంధ్రరాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు సంబంధించి మహిళలు 75కేజీల విభాగం, పురుషులు 85కేజీల విభాగంలో ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1605.28	1,584.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	21,643	17,383
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	205	266
సామర్థ్యం (టీఎంసీలు)	29.16	6.89

రూమ్ టు రీడ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రంగుపుస్తకాలను పంపిణీ చేస్తున్న రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, జూలై 13: జేఎస్‌డబ్ల్యూ అమలు చేస్తున్న రూమ్ టు రీడ్ ప్రాజెక్ట్ వినూత్నమైన కార్యక్రమని కర్ణాటక యాక్టివ్ టీచర్స్ వేదిక బళ్లారి జిల్లా అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఒకటి నుంచి ఐదోతరగతి చదువుతున్న పిల్లలకు వివిధ చిత్రాలు, రంగులు, పంచతంత్రాలతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. పుస్తకాలు ఆకుపచ్చ, ఎరుపు నారింజ తెలుపు నీలం, పసుపు రంగులలో ఉంటాయి. ఆకుపచ్చరంగు ప్రారంభస్థాయిని సూచిస్తుందని, పసుపు రంగు గరిష్ట స్థాయి అభ్యాసాన్ని సూచిస్తుందని, పిల్లల అభ్యాస స్థాయిని కొలవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. కాబట్టి విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా హలకుంది శ్రీనివాసులు, కన్నడభాషా ఉపాధ్యాయులు బసవరాజు, చన్నమ్మ, సుమతి, వైశాలి, రామాంజినేయ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

బళ్లారిరూరల్, జూలై 13: బళ్లారిరూరల్ పరిధిలోని యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లండన్ మిషన్ ప్రైమరీ హైస్కూల్ పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజర్‌గా విల్సన్ అధ్యక్షతన ముఖ్య అతిథులు శాంతాల, మరిరాజ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో విల్సన్ మాట్లాడుతూ.. పేద బడుగు బలహీన వర్గాలకు ప్రైమరీ స్కూల్లో తమ సంస్థ నోట్‌పుస్తకాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యేసుపాల్ కార్యదర్శి మోహన్ పాస్టర్ ప్రభాకర్, గజేంద్ర వర్మ, హెలెన్ జ్యోతి మారెమ్మ, ప్రధానోపాధ్యాయులు మేరీ పాల్గొన్నారు.

బస్సుయాత్రకు పచ్చజెండా



బస్సు యాత్రకు పచ్చజెండా ఊపుతున్న దృశ్యం

సిరుగుప్ప, జూలై 13 : బాబు జగ్జీవన్ రామ్ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవానికి దళితనాయకులు బెంగళూరుకు తరలివెళ్లారు. శనివారం సిరుగుప్ప పట్టణం హైస్కూలు గ్రౌండ్‌లో తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి బస్సు యాత్రకు పచ్చజెండా ఊపడం ద్వారా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ పేరిట శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కేంద్ర ప్రారంభోత్సవానికి వేలాదిమంది దళిత నాయకులు తరలివెళ్లారు. హాస్టల్ వార్డెన్లు బాలప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరీక్షాకేంద్రాన్ని పరిశీలించిన కృష్ణగిరి కలెక్టర్

హోసూరు, (కృష్ణగిరి) జూలై 13: తమిళనాడు ప్రభుత్వ స్టాఫ్ సెలెక్షన్ బోర్డు పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలను కృష్ణగిరి జిల్లా కలెక్టర్ శనివారం సందర్శించి తనిఖీ చేశారు. కృష్ణగిరి జిల్లా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, భారత్ మెట్రిక్ ఉన్నత పాఠశాల, జాన్‌బాస్కో మెట్రిక్ ఉన్నత పాఠశాల, సెయింట్ ఉన్నత పాఠశాల, నళంద మెట్రిక్ పాఠశాలల్లో తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-1 పరీక్ష రాశారు. 3.953 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిల్లో 2.498 మంది పరీక్షకు హాజరయ్యారు.



పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న కృష్ణగిరి కలెక్టర్

తుంగభద్ర బోర్డుకు నిధులు నిల్



హెచ్చెల్సీలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు..

- కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయల బకాయిలు
- బోర్డు పనులకు ముందుకురాని వైనం
- ఈ ఏడాది 400 టెండర్లలో 25 శాతం కూడా ఫైనలైజ్ కాక హెచ్చెల్సీలో పేరుకుపోయిన పూడిక

బళ్లారి గాంధీనగర్, జూలై 13: కర్ణాటక, ఆంధ్ర రాష్ట్ర జీవనాడిగా నిలిచిన తుంగభద్ర డ్యాం బోర్డు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతుండగా... చేసిన పనులకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించలేక బోర్డు అధికారులు, ఇంజనీయర్లు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బోర్డు పరిధిలోని హెచ్చెల్సీ, ఎల్లెల్సీ క్రింద చేపట్టిన కాలువ అభివృద్ధి పనులకు సంబంధించి సుమారూ రూ.400 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇలాంటి గడ్డుకాలం తుంగభద్రకు వస్తుందని కలలో అనుకోలేదని బోర్డు పరిధిలో పనిచేసే సీనియర్ కాంట్రాక్టర్లు అభిప్రాయ పడుతున్నారు. అధికారులపై విశ్వాసం, నిధులు విడుదలవుతాయనే నమ్మకంతో కోట్లాది రూపాయలు ఖర్చుచేసి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ప్రతి యేటా కాలువలకు నీళ్ళు నిలిచిపోయిన వెంటనే హెచ్చెల్సీ, ఎల్లెల్సీ నిర్వహణ పనులు చేపట్టి జులై ఆఖరులోగా పనులు పూర్తి చేసేవారు. అయితే గత రెండేళ్ళుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి నిధులు నిలిచిపోవడంతో బోర్డు పనులు అంటేనే కాంట్రాక్టర్లు మొహం చాటేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది కాలువల అభివృద్ధి కోసం పిలిచిన సుమారు 400 టెండర్లలో 25శాతం టెండర్లు కూడా ఫైనలైజ్ కాకపోవడం విడ్డూరం. ఇప్పటికే కొన్ని టెండర్లు బిడ్డర్లు లేక, సింగిల్ టెండరు కారణంగా క్యాన్సిల్ అయ్యాయి. కాలువల్లో అత్యవసర పనులు చేయాల్సిన నేపథ్యంలో బిడ్డర్లు ఎక్సెస్‌కు వేసిన టెండర్లను సైతం అంగీకరించాల్సిన పరిస్థితి బోర్డులో నెలకొంది. మరికొన్ని టెండర్లకు రివర్స్ టెండరింగ్ చేసి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఈ-టెండర్లలో అతి తక్కువగా కోట్ చేసిన వారే టెండర్లు దక్కించుకోవడం పరిపాటి. పనులు చేపట్టడానికి బిడ్డర్లు ముందుకు రాకపోవడంతో రివర్స్ టెండరింగ్ ద్వారా అత్యవసర పనులను కట్టబెట్టాల్సిన పరిస్థితి బోర్డులో నెలకొనడం విచారించదగ్గ విషయం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మారిన ప్రభుత్వమైనా బోర్డుకు అవసరమైన నిధులు విడుదల చేస్తుందని పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు కళ్ళకు ఒత్తులేసుకుని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం బోర్డు పరిస్థితి ఇలా ఉండగా... కాలువల నిర్వహణకు నిధులు లేకపోవడంతో హెచ్చెల్సీ 85వ కిలోమీటరు సమీపంలో కాలువల్లో పూడిక పేరుకుపోయి ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగాయి. ఇలాగైతే కాలువల్లో నీరు ఎలా సాఫీగా ప్రవహిస్తుందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

▼ ఎస్కేప్ చానల్ వద్ద వదిలేసిన పూడిక మట్టి ▼



18 నుంచి ఎమ్మిగనూరులో ధార్మిక కార్యక్రమాలు



కరపత్రాలను విడుదలచేస్తున్న వామదేవ శివాచార్యులు

కంప్లి, జూలై 13 : కంప్లి తాలుకా ఎమ్మిగనూరు మహంత మఠంలో సిద్ధలింగ శివాచార్య 23వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 18 నుంచి ధార్మిక కార్యక్రమాలు జరుపనున్నట్లు వామదేవ శివాచార్యులు తెలిపారు. మఠంలో జరిగే కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిద్ధలింగ శివాచార్య పుణ్యారాధన కార్యక్రమాలను పండుగలా నిర్వహిస్తున్నామన్నారు. యేటా గ్రామంలోని ప్రజలతో పాటు వివిధ గ్రామాల భక్తులు ఈ కార్యక్రమాన్ని సంభ్రమంగా జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో సదాశివప్ప, మహేష్ గౌడ, చెన్నప్ప, శేఖర్, అశ్వర్థరెడ్డి, హంపి జడేమూర్తి, శరణగౌడ, బసవరాజు, ఊగప్ప, మల్లికార్జున, వీరేష్ గౌడ, కరిబసయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కార్యవర్గం ఎంపిక

కంప్లి, జూలై 13 :కంప్లి తాలుకా పరిధిలోని దేవలాపురం ప్రాథమిక పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షుల నియామకం జరిగింది. అధ్యక్షులుగా లింగన్నగౌడ, ఉపాధ్యక్షులుగా కళావతి, సభ్యులు రేణుక, కురిజడెమ్మ, బసయ్య, మంజునాథ్, బాబుసాబ్, గౌడ్రు షణ్ముఖప్ప, దేవరమనే హనుమయ్యలను ఎన్నుకున్నట్లు హెచ్ ఎం శోభ తెలిపారు. పదాధికారులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకారమందిస్తామని తెలిపారు.

తుంగభద్ర తీరవాసులకు ముందస్తు హెచ్చరికలు

కంప్లి, జూలై 13 : తుంగభద్ర నది తీరాన హరప్పనహళ్లి తాలుకా ప్రజలకు అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. డ్యాం పైప్రాంతాల్లో వర్షాలు అధికం కావడంతో నదికి నీటి ప్రవాహం పెరిగిందని కనుక జాగ్రత్తగా ఉండాలని నది ఒడ్డున వుండే నిట్టూరు, కడతి, నంద్యాల, హావరగుంది, తదితర గ్రామాలకు హెచ్చరికలు జారీచేశారు. అలాగే గర్భగుడి, నిట్టూరు, బసాపుర ప్రాథమిక పాఠశాలల్లో హెల్త్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నది ఒడ్డున గ్రామాల్లోని ప్రజలకు ప్రాణ నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



హరప్పనహళ్లి వద్ద ఉధృతంగా పారుతున్న తుంగభద్ర

30టిఎంసీలకు చేరిన జలాశయ నీటి మట్టం

బళ్లారి గాంధీనగర్, జూలై 13: తుంగభద్రకు ఇప్పటిదాకా పెరిగిన వరద ప్రవాహం క్రమేణా తగ్గుతూవస్తోంది. ఈ నెల 7వ తేదీన ఒక్కసారిగా 50వేల క్యూసెక్కులకు పెరిగిన వరద శనివారం నాటికి 21వేల క్యూసెక్కులకు గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం జలాశయానికి నీటిరాక తగ్గిపోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. తుంగభద్ర ఎగువ ప్రాంతాల్లో ఉన్న ఫళంగా వర్షాలు తగ్గుముఖం పట్టడమే జలాశయానికి వరద తగ్గిపోవడానికి కారణమని బోర్డు అధికారులు భావిస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది జలాశయానికి నీటి చేరిక సంతోషించదగ్గ విషయమే అయినా... గత ఏడాది నష్టాన్ని పూరించుకునే దిశలో ఇప్పటికే రైతులు ఆయకట్టు భూములను సిద్ధం చేసుకుని సాగునీటి కోసంఎదురు చూస్తున్నారు. వరద వేగం తగ్గినప్పటికీ ప్రస్తుతం జలాశయానికి 21,643 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, డ్యామ్‌లో 30.690 టీఎంసీల నీరు నిలువ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 7,069 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుండగా, 7.069టిఎంసి నీరు నిలువ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.

బళ్లారిలో గాలివాన



దుర్గం సర్కిల్ వద్ద నిలిచిన వర్షపునీరు

బళ్లారి రూరల్, జూలై 13: బళ్లారి నగరంలో శనివారం సాయంత్రం ఉన్నపళంగా ఆకాశం మేఘావృతమై విపరీతమైన గాలివాన కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో నగరం చల్లబడింది. నగరంలో పనులు ముగించుకుని వాహనదారులు, పాదచారులు ఆఫీసు నుండి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నేమకల్లు ఆంజనేయుడి సేవలో బళ్లారి ఏఎస్పీ



స్వామివారి సేవలో బళ్లారి ఏఎస్పీ

బొమ్మనహాళ్, జూలై 13: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు వేకువజామునే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ చేశారు. తర్వాత విష్ణు పారాయణం, అష్టోత్తర పూజలు, నైవేద్యం సమర్పణ గావించి మహా మంగళహారతి ఇచ్చారు. బళ్లారి అడిషనల్ ఎస్పీ రవికుమార్ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. టీడీపీ నాయకులు గాలి బసప్ప తదితరులు ఏఎస్పీని స్వాగతించి పూజలు జరిపించారు. ఆలయ సన్నిధిలో భక్తులకు అన్నదానం జరిగింది.

గొడ్డలితో నరికితే నొప్పి మాయం!

- బాగల్‌కోట జిల్లాలో వింత ఆచారం
- వైద్యం చేస్తున్న పూజారి అరెస్టు

బళ్లారి గాంధీనగర్, జూలై 13: మానవుడు ఎంత సాంకేతిక విజయాలు సాధించినా... ఇంకా వింతనమ్మకాల మధ్యలో నలిగి పోతున్నాడనడానికి ఇక్కడ కనిపిస్తున్న దృశ్యమే అద్దం పడుతోంది. ఎవరికైనా శరీరంలో నొప్పి ఉందంటే ఆ ప్రాంతంలో గొడ్డలితో నరికి బండారు పూస్తే నొప్పి మాయమవుతుందని కొందరు నమ్ముతున్నారు. రోగం తగ్గడం అటుంచి దీంతో ఇంకా సమస్యలు కొనితెచ్చుకుంటున్న ఘటన ఇటీవల వెలుగు చూసింది. బాగల కోట జిల్లా ముధోళ తాలూకా మెట్టగుడ్డ గ్రామంలో కాశిలింగేశ్వర దేవస్థానం పూజారి వద్ద నిత్యం ఇలాంటి ఘటనలు జరగడం పరిపాటిగా మారింది. ఈ మధ్యనే ఓ వ్యక్తి కడుపునొప్పితో ఆయన వద్దకు రాగా, పూజారి రోగిని వెల్లికిలా పడుకోబెట్టి... కాళ్ళు ఒకరు... చేతులు ఒకరు పట్టుకోగా... ఏకంగా కట్టెను నరికినట్లు... ఏకంగా పొట్టమీద పదునైన గొడ్డలితో నరుకుతుండగా... మరో వ్యక్తి తెగిన ప్రాంతంలో కుంకుమ బండారు చల్లుతున్న దృశ్యాలు... సోషియల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఎట్టకేలకు ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్ళడంతో స్థానిక పోలీసులు వైద్యం చేస్తున్న అతడిని అరెస్టు చేశారు. మానసిక అస్వస్థత కారణంగా మనిషిలో కలిగే మార్పులను రూపుమాపడానికి మనుషులను చిత్ర హింసలకు గురిచేస్తున్న ఘటనలు ఇంకా వెలుగు చూస్తున్నాయి. కర్ణాటకలో చాలా చోట్ల ఇంకా ఇలాంటి వింత ఆచారాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం బాగల్ కోట జిల్లాలో జరిగిన ఈ ఘటన జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అందరినీ ఆలోచింపచేస్తోంది. కాని ఇందులో ఆక్యూపెజర్, ఆక్యూపంక్చర్ టెక్నిక్స్ ఏమైనా ఉన్నాయేమో పరిశీలించాల్సి ఉందని కొందరు అంటున్నారు.



నొప్పిఉన్నచోట పొట్టపై గొడ్డలితో వైద్యం చేస్తున్న పూజారి

ముళ్ల కంపలను తొలగించండి



రోడ్డుకి ఇరువైపులా పెరిగిన ముళ్లకంపలు

కంప్లి, జూలై 13: కంప్లి నుంచి హోస్పేట రోడ్డుమార్గంలో రోడ్డుకు ఇరువైపులా వుండే ముళ్లకంపలను తొలగించాలని బీఎస్ఎస్ సంఘం అధ్యక్షులు చెన్నప్ప కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామసాగర నుంచి బుక్కసాగర వెళ్లే రోడ్డు మార్గంలో ఇరువైపులా పంపాపతి విద్యాపీఠం మలుపుల వద్ద ముళ్లకంపలు వుండటంతో ఎదురుగా వచ్చే వాహనం కూడా కనిపించకుండా పోతోందన్నారు. ఎదురుగా వస్తున్న వాహనం వల్ల ఎటు నుంచి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారన్నారు. కావున పీడబ్ల్యూడీ అధికారులు వెంటనే రోడ్డుకు ఇరువైపులా వున్న ముళ్లకంపలను తొలగించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

వైరల్ జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు

కంప్లి, జూలై 13 : గ్రామాల్లో వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల డెంగీ, మలేరియా జ్వరాలు వ్యాపించాయి. కంప్లి పట్టణంలో వర్షాల వల్ల వాతావరణంలో మార్పులు వచ్చి వైరల్ జ్వరాలతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సందర్భంగా తాలుకా వైద్య అధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఇప్పటికే రోగులకు కావాల్సిన మందులు ఆస్పత్రిలో సిద్ధంగా వున్నాయన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎలాంటి జ్వరం వచ్చినా వెంటనే ప్రభుత్వాస్పత్రికు వెళ్లి చికిత్స పొందాలన్నారు. దీంతో పాటు డెంగీ, మలేరియా జ్వరాల పట్ల జాగ్రత్తలు వహించాలని, ప్రతి ఒక్కరు తమ చుట్టూ నీరు నిల్వ వుండకుండా జాగ్రత్త వహించాలన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. లేకపోతే జ్వరాల ప్రభావం తప్పదన్నారు.



వైరల్ జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగి

హోసూరు జోన్

ఉపఎన్నికల్లో విజయంతో మిఠాయిల పంపిణీ



డీఎంకే ఆధ్వర్యంలో మిఠాయిల పంపిణీ

హోసూరు, జూలై 13 : విళుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ ఉప ఎన్నికల్లో అన్నియూర్ శివ అపూర్వ విజయం సాధించిన సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. కృష్ణగిరి డీఎంకే ఆధ్వర్యంలో హోసూరు తాలూకా కార్యాలయం సమీపంలోని అన్న విగ్రహానికి పూలమాల వేసి, పటాకులు పేల్చారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.ప్రకాశ్, అధ్యక్షత వహించారు. అన్న విగ్రహానికి పూలమాల వేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమానికి మేయర్ సత్య స్వాగతం పలికారు. అలాగే జిల్లా కౌన్సిల్ చైర్మెన్ యువరాజ్, కోశాధికారి సుకుమారన్, రాష్ట్ర యూత్ డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసన్, ముఖ్య కార్యవర్గ సభ్యుడు ఎల్లో రమణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, నగర కౌన్సిల్ చైర్మెన్, సెందల్‌కుమార్, ఉప కార్యదర్శి రవికుమార్, కోశాధికారి త్యాగరాజన్, డివిజన్ కార్యదర్శి ఆనందయ్య రాము, వెంకటేష్, టీమ్ ఆర్గనైజర్లు కన్నన్, శక్తివేల్, రాజ, మాణిక్యవాసగం, ఇక్రమ్ అహ్మద్, కౌన్సిల్ సభ్యులు మునిరాజ్ , నాగరాజ్, అరుళ్ సహ జిల్లా నగర యూనియన్ కార్యదర్శులు, రాష్ట్ర జిల్లా నగర యూనియన్ ఏరియా బరో ఉప నిర్వాహకులు తండాలు, మాజీ స్థానిక ప్రభుత్వ ప్రతినిధులు, వార్డు కార్యదర్శులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యాకమిటీ సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ శ్రీధర్

హోసూరు, జూలై 13: పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చైర్మెన్ శ్రీధర్ పేర్కొన్నారు. హోసూరు కార్పొరేషన్ విద్యాకమిటీ సమావేశం కార్పొరేషన్ కార్యాలయంలో జరగగా దానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశానికి మున్సిపల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రాజారాం, హోసూరు కార్పొరేషన్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. హోసూరులో మున్సిపల్ పాఠశాలలు బాగా పనిచేస్తున్నాయని, ఈ పాఠశాలకు అవసరమైన తరగతి గదులు, విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు, మౌలిక వసతులను పురపాలక సంఘం ఏర్పాటుచేస్తోందని, పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్పొరేషన్ పాఠశాలకు అవసరమైన క్లీనర్లను నియమించామని ప్రైవేట్ పాఠశాలలకు సమాంతరంగా మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలు కూడా పనిచేస్తున్నాయన్నారు. ఈ సమావేశంల్లో నగర సంక్షేమాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో డెంగ్యూ జ్వరాలు ఎక్కువగా నమోదవుతుండడంతో రాష్ట్ర సరిహద్దులోని హోసూరు ప్రాంతాల్లోని పాఠశాలల్లో వర్షపు నీరు చేరకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే స్కూల్ క్లీనర్లను గౌరవంతో పిలువాలని కోరారు.

గృహ వసతి ఏర్పాటు

హోసూరు, జూలై 13: హోసూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒనల్‌వాడీ పంచాయతీ యూనియన్ సోమనాథపురం గ్రామంలో లబ్దిదారులకి గృహ వసతి పత్రాలను అందచేస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై.ప్రకాశ్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, శూలగిరి మాజీ సంయుక్త కార్యదర్శి వెంకటేష్, యూనియన్ కమిటీ సభ్యుడు రమేశ్, పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు మాదేశ్, ప్రభుత్వ అధికారులు, డీఎంకే అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి సాధిద్దాం

- రాయచూరు జిల్లాధికారి నితీశ్ పిలుపు



కొత్త డీసీ నితీశ్‌ను సన్మానిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

రాయచూరు, జూలై 13 : అన్ని శాఖలు సమన్వయంతో పని చేయడం ద్వారా జిల్లాలో సమగ్ర అభివృద్ధికి బాటలు వేద్దామని నూతన జిల్లాధికారి నితీశ్ సూచించారు. కొత్తగా జిల్లాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లాధికారి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయడంతో పాటు ప్రజాప్రతినిధులు, సంఘ సంస్థలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటికీ రాయచూరు జిల్లా వెనకబడినదిగా గుర్తింపు పొందడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక అవసరాలు గల జిల్లాలలో ఒకటిగా ఉన్న విషయాన్ని అందరూ గమనంలోకి తీసుకోవాలన్నారు. అభివృద్ధి విషయంలో క్షేత్ర స్థాయి సమస్యలను ముందుగా అర్థం చేసుకుని వాటి పరిష్కారం కోసం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుదామని ఈ విషయంలో అధికారులందరికి తాము పూర్తి తోడ్పాటు నందిస్తామన్నారు.

రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలి



నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

రాయచూరు, జూలై 13: విద్యాపరంగా అత్యంత వెనకబాటుతనానికి గురైన రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరుచేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్‌కళస అన్నారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం అఖిల పక్షం, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష శుక్రవారం 793వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ స్టేడియంలోని దీక్ష శిబిరం వద్ద ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస మాట్లాడుతూ.. ఇప్పటికే జిల్లాకు ఐఐటీ ఇస్తామని చెప్పిన పాలకులు దాన్ని ఇతర జిల్లాకు తరలించడం జిల్లా ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడు నోరు విప్పకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. జిల్లాలో వైద్య సేవలకు విస్తృత అవకాశం కల్పించాలని కోరారు.